# అనాదివాళ్లు

మా ఆచార్ల దైవభక్తి మా కెప్పుడూ విడ్డూరంగానే వుండేది. వాని పిలకా, వాని నామాలూ, వాడూ-చూపేవాళ్ళ కెవరికీ వానిమీద గానీ, వాని దైవభక్తిమీద గానీ గౌరవం కలుగదు. పైగా వాని పోజులు - ప్రహ్లాదునికంటె, సక్కుబాయికంటె, పక్క వీధిలోని పాండురంగయ్య మూడో పెళ్లాం ముత్యాలమ్మకంటె, తానే గొప్ప భక్తుడైనట్లు! మాటల మధ్యలో హఠాత్తుగా "ఆది మధ్యాంత రహితా! ఆపద్బాంధవా!" అంటూ తన దైవ నామస్మరణతో మాకు విసుగెత్తించేవాడు. "ఆది మధ్యాంత రహితా యేమిట్రా? అంతకంటె చిన్న సులభమైన పేరేదీ లేదా నీ భగవంతునికి?" అని మే మెవర మైనా అడిగితే, "వోహోహో! ఆ భగవంతుడు అనంతుడు: వాడు అనాదివాడు!" అంటూ భక్తి పారవశ్యంతో కండ్లు తేలవేసి వూపిరి బిగబట్టేవాడు.

యీరోజు ప్రొద్దున ఆచార్లూ, నేనూ, రాజశేఖరం ముగ్గురం వున్నాం, మా రూంలో. వున్నట్టుండి "అనాదివాన్ని, గుడ్డివాన్ని కాణీ ధర్మం సెయ్యండి బాబూ!" అన్న యాంత్రిక ఆర్తనాదం బయటనుంచి రూంలోకి వినవచ్చింది.

యేదో భారతీయ వేదాంత గ్రంధం చదువుతున్న ఆచార్లు దిగ్గున లేచాడు. అర్ధరాత్రి నిద్రలోకూడా అపుడపుడు అట్లా లేస్తుంటాడు. యేదో వేదాంతపరమైన రహస్యాలను గొణుక్కుంటూ వుంటాడు. యెవరూ పట్టించుకోకుంటే తలుపులు తీసుకొని బజార్లలో పడతాడు.

"అడుగో అనాదివాడు. నాగదికి వచ్చాడు. వచ్చావా ప్రభూ! యెన్నాళ్ళకెన్నాళ్ళకు! నాపైని కరుణ! నాపై నీదయ కెన్నాళ్ళకెన్నాళ్ళకు! యీ దీనుని తపన ఫలించింది! అన్వేషణ కొక గమ్యం దొరికింది!!"

యిట్లు అరుస్తూ చొక్కాలేని, జందెప్పోగులోవున్న ఒక్కటి అస్థిపంజరంలాంటి ఆచార్లు బయటికి వెళ్తున్నాడు. అంతవరకు పై కప్పుకేసి చూస్తూ యేదో ఆలోచిస్తున్న రాజశేఖరం గభాలున లేచి. ఆచార్ల మెడమీద వొక దెబ్బకొట్టి "యేమిట్రా హిస్టీరియా తగిలిన ఆడదాన్లాగా అరుస్తావు? అనాదివాడట! నీ రూం కొచ్చాడట! మంత్రులు, పత్రికలవాళ్లు కొంపలుగట్టించి చస్తున్నారే దేవుళ్ళకు. యిక్కడికి రాడులే. బయట అరిచింది నయాపైసా భిక్షగాడు. వొట్టి భిక్షగాడు. దరిద్రుడు!" అని అనటంతో ఆచార్లు హతాశుడై ట్రంకు మీద కూలబడ్డాడు.

"అనాదివాన్ని. గుడ్డివాన్ని. దర్మం సెయ్యండి బాబూ" మళ్ళీ అదే మొర. "వొరే నీదగ్గర ఒక్క నయాపైసా వుంటే అప్పు యివ్వరా. యీ అప్రాచ్యున్ని తరిమేసివస్తా. నా అనాదివాన్ని కన్ఫ్యూజ్ చేసేస్తున్నాడు" అంటూ ఆచార్లు నన్నడిగాడు. వొక నయా

పైసా తీసి యిచ్చాను. ఆచార్లు బయటికి వెళ్లి వాళ్ళ కాదానం చేసి వచ్చాడు. దానం చేసిన తృప్తి వాడి ముఖంలో లేదు. యెందుకో ఆచార్ల ముఖంలో కలగాపులగపు విషాద చ్ఛాయలు కన్పిస్తున్నాయి.

రాజశేఖరం అందుకున్నాడు:

"యేంటి ఆచార్లూ! యేడు కొండల వాడి ముఖం పెట్టావు? షేక్స్పియర్ ముఖంకంటే ఘోరమైంది యేడుకొండలవాడి మొగం."

ఆచార్లను యేడిపించడం రాజశేఖరం దినచర్యల్లో వొకటి. దేశంలోని ఛాందసత్వాన్ని, మౌఢ్యాన్ని, అజ్ఞానాన్ని యెదుర్కొనే శక్తి లేదు రాజశేఖరానికి. బహుశా అందుకేనేమో పైవాటి ప్రతినిధైన ఆచార్లమీద దండెత్తుతుంటాడు, మాటి మాటికి. తద్వారా తనకొక మానసి కానందం, పైగా ఆచార్లు భయస్తుడు.

ఆచార్లు యెంతకీ పలక్కపోయేసరికి నేనే అడిగా యేమైందని.

"చూడరా అంత అందవికారంగా అసహ్యంగా డోకొచ్చేలా వున్నాడు; కురుపుల్తో, చీముల్తో, కుంటికాల్తో, పైగా గుడ్డికండ్లతో- వాడా అనాదివాడు? ఆ లీలామానుష విగ్రహుడు, ఆనంద స్వరూపుడు భగవంతుడెక్కడ? వీడెక్కడ? భగవంతునిపట్ల యెంత అత్యాచారం? కాలాతీతుడైన ఆ సర్వాంతర్యామి, సర్వజనకుడు అనాదివాడవుతాడు కానీ యీ గుడ్డిముండావాడెట్లా అవుతాడు?" ఆచార్లు రొప్పుతూ వణుకుతూ చెపుతున్నాడు.

యేదైనా వేదాంతపరమైంది చెప్పాలనుకున్నప్పుడు భక్తి పారవశ్యంవల్ల ఆచార్ల శరీరం యెన్నో వంకరలు పోతుంది, యిదొక జబ్బు అంటాడు రాజశేఖరం.

పై మాటలు ఆచార్లు అనేవేళకి రాజశేఖరం ఫక్కున గట్టిగా నవ్వేశాడు. వో మూడు నిముషాలు అట్లా నవ్వి ఠక్కున ఆపేసి సీరియస్‌గా అన్నాడు:

"వొరే ఆచార్లూ! నీక్కూడా సౌందర్యదృష్టి వుందిరా? యేడు కొండలవాన్ని పూజారి పొమ్మనేదాకా తన్మయత్వంతో చూసే నీవు ఆ భిక్షగాన్లో సౌందర్యం లేదంటావా? నీ మొహమ్మండా! మీ స్వామిలో కంటే నాకు తుమ్మమొద్దులో యెక్కువ సౌందర్యం కన్పిస్తుంది. ఛఛ! వొరే! యింకొక్క విషయం. ఆ భిక్షగాళ్ళను వాళ్ళు అనాదివాళ్ళు అంటున్నావు కదూ! మన పూర్వులు రాసిన పురాణకథ చెపుతాను. పురాణాలనే చరిత్ర అనుకోమని వాళ్ళు యిప్పటికీ అంటున్నారు. కాబట్టి వొక విధంగా యీ కథకూడా చరిత్రే. యిది కుక్షింభర పురాణంలో వుంది."

"అదెక్కడిది?" ఆచార్లు నెయ్యి వేశాడు, మంటలో.

"మీ నాన్న నడుగు. మీ అబ్బ నడుగు. పురాణాలు రాసి కల్పించి మడులూ మాన్యాలూ సంపాయించి పొట్టలు పెంచుకున్న మీ తాత ముత్తాతల నడుగు. నన్నడిగితే?! మీ జాతి నడుగుఆచార్లూ." వుద్రేకంగా అనేశాడు రాజశేఖరం.

"వొరే చూడు! జాతి పేరెత్తుతాడు, సెక్యులర్ స్టేటులో! పైగా పేరు పేరునా మా వాళ్ళందరిని తిట్టాడు. నేనిక వీన్ని భరించ లేను. రూం మార్చేస్తా" వణుకుతున్నాడు ఆచార్లు.

జాతి అనటంలోకాని, అబ్బ, నాన్న అనటంలోకాని రాజ శేఖరానికి వ్యక్తిగత ద్వేషం అంటూ యేమీ వుండదని నాకుతెలుసు. ఆ విషయం చెప్పినా ఆచార్ల సంస్కారం వొప్పుకోదు. కాబట్టి వూరుకున్నా.

"లేకపోతే యేమిట్రా ప్రతిదానికి నీ బోడి తర్కం. అనుమా నం. వాటినే నేనూ వుపయోగిస్తే నాకు నమ్మకం లేదంటావు. సంప్రదాయాన్ని గబ్బిలంలా కరుచుకుంటావు. ఫిలాసఫీ ఆనర్సే చదువుతున్నావనుకో. నీతి నిష్ఠా వుండే కొంపలోనే పుట్టావనుకో. నీకెన్ని పురాణాలు తెలుసు? విజ్ఞానమంతా నీసొత్తూ. నీ అబ్బసొత్తూ అనుకునే కాలం కాదే యిది. నీకు తెలిస్తే పద్దెనిమిది పురాణాలు తెలుసు. మొన్న వోరియంటల్ ఇన్స్టిట్యూట్‌లో వొక గోనెసంచిలో కట్టివుంటే నేనీ కుక్షింభర పురాణంచూశా. మావూళ్లో పోలినాయుడు అటకమీద కొంత పురాణం దొరికింది. అయినా యింత వుదాహర ణలు చెప్పాల్సిన పన్లేదు. కావాలంటే రాధాక్రిష్ణ పండితున్నడిగి కనుక్కో. బండార్కర్ ఇన్స్టిట్యూట్‌కు రాసి కనుక్కో!

''రాజశేఖరం ముందు కథచెప్పు. ఆచార్ల సంగతి నీకు తెలుసుగా. పండిత వంశంలో పుట్టాడు. తర్కబలం వాడిసొత్తు. అనుమానం వాడికత్తి" అన్నాను.

"సర్లే. మధ్యలో నాదేం పోయింది. యేదో సంప్రదాయా నికీ, పురాణాలకూ అన్యాయం జరుగుతోంటే వుండబట్టలేక అన్నా కానీ'' మూలిగాడు ఆచార్లు.

"యింతవరకు యేదోలే పోనిమ్మనుకున్నాను. యిక మధ్యలో అడ్డంటు వచ్చావో నీ జందెం బజార్లో వొ గజ్జికుక్కపిల్ల మెడక్కడతా. నీ నామం నాకేస్తా. నీ పిలక పీకేస్తా. నేను చెప్పేది అబద్ధం. పుస్తకాల్లో లేదు. అని యేపైన నీ మడిపుస్తకాలు చూపావా? నిన్నూ. నీ పుస్తకాల్ని మురికి కాలవలో వేయిస్తా. యిదిగో బ్రదర్! రెఫరీవి నువ్వు. చూస్తూండు." రాజశేఖరం పిడికిలి బిగించాడు.

శృతిమించి రాగాన పడటం యిష్టంలేక "చెత్త మాట్లాడక కథకు రా. అనవసరంగా ఆచార్లమీదికి మాటిమాటికి దండెత్తకు" అన్నా.

నేనిట్లా అపుడపుడు ఆ యిద్దర్లో యెవర్నో వొకర్ని అంటూంటే యిద్దరూ భయపడతారు. నాకో క్రెడిట్ అది. అయితే సాధారణంగా వాళ్ళు కీచులాడుకుంటున్నా అందులోకి దిగను. దిగకుండా వూరికేచూస్తూ. అవసరమైనా. అనవసరమైనా అప్పుడప్పుడు గట్టిగా నవ్వేస్తుంటాను. వాళ్ళ యుద్ధాన్ని పరోక్షంగా యెగదోస్తూ. అంటనట్టువుంటూ యెంజాయ్ చేస్తూండటంవల్ల వాళ్ళిద్దరూ నేనంటే భయపడతారు. తమకు తెలియని గొప్పతనం యేదో నాలో వుందని అనుకుంటున్నారు. "నీవొక దొంగ రాస్కెలివి" అని నా ప్రేక్షకత్వాన్ని పరిశీలించిన వొక మిత్రుడన్నాడు. యిది నిజమో కాదో నాకు తెలియదు.

రాజశేఖరం కథ మొదలు పెట్టాడు:

"మొట్టమొదట భారతదేశంలో అదీ అరుణాచలంలోనే ప్రళయం వచ్చింది. యిక్కడ నా వ్యాఖ్య వొకటి వుంది. భారత దేశంలోనే ప్రళయం యెందుకు రావాలి? యే జపాన్‌లోనో, సిసిలీ లోనో, రష్యాలోనో రాకూడదా? రాదు. యితరదేశాల్లో ప్రళయం రావటం మన మేధోసన్యాసులకు యిష్టం వుండదు. దేశాన్ని, ప్రజల్ని నడిపించేది వాళ్ళే కాబట్టి యిక్కడ ప్రళయంవస్తే అభయమిస్తామని ప్రజల్ని దగ్గరకు రప్పించుకొని పాపులారిటీ పెంచుకోవచ్చు కాబట్టి మనదేశంలోనే ప్రళయం రానిస్తారు మన యోగులు."

"యిదీ కుక్షింభర పురాణంలో వుందా?" ఆచార్లు మళ్ళీ అస్త్రం ప్రయోగించాడు.

"వుందోయ్. నీవు చూసినావా? అదెంత బరువుండేది నీకు తెలుసా? నీవు నోరు మూసుకో. పురాణంలో ప్రళయానికి నా వ్యాఖ్య నిచ్చాను.

ప్రళయం తర్వాత సృష్టి జరిగింది. యిద్దరే యిద్దరు పుట్టారు. అయితే వాళ్ళిద్దరిలో యెవరు ముందు పుట్టిందీ తెల్పడానికీ, రిజిష్టర్లో రాసుకోడానికీ కాంగ్రెసు ప్రభుత్వం లేదు, బిడ్డల్నే కుక్కలెత్తుకపోయే ఆస్పత్రులులేవు. కాన్పు జరిగిన నాలుగు రోజులకువచ్చే మిడ్‌వైపులు లేరు. యిక అమ్మ, నాన్న లేరు కాబట్టి వాళ్ళిద్దర్లో యెవరు ముందు పుట్టింది తెలియదు. అయితే పురాణకర్త వాళ్ళిద్దర్నీ 'యేకకాల జనితులు' అన్నాడు. కానీ చిన్నాపెద్దా సూచించలేదు. వాళ్ళిద్దరే మన ఆచారిగాడి అనాదివాడు, యిపుడు నయాపైసా తీసుకపోయిన అనాది వాడు."

"అబద్ధం. స్కాండలస్. ఘోరం. పెద్ద అనక్రానిజం. యిపుడు నయాపైసా తీసుకపోయినవాడు మొదటి అనాదివాడితో పుట్టాడా?" గడగడా వణకుతున్నాడు ఆచార్లు.

"ఆచార్లూ విజ్ఞానం పెరిగిపోయిన ప్రపంచంలో నీవే వొక పెద్ద అనక్రానిజం. యిపుడు నయాపైసా తీసుకపోయినవాడు మొదటి అనాదివాడితో పుట్టిన అనాదివాని సంతతిలోనివాడు. యిక నేను చెప్పేది అబద్ధం అంటావా? కావాలంటే అరుణాచలంలో ఈశ్వరుడున్నాడు. పోయి కనుక్కో" పట్టి పట్టి తాపీగా సమాధానిస్తూ ఛాలెంజి విసిరాడు రాజశేఖరం.

"సరే తర్వాతకథ" అన్నాను. వాడు నిజం చెప్పుతున్నాడా అబద్ధం చెపుతున్నాడా అనేదానిపైన నాకు కుతూహలంలేదు. వాడు చెప్పేది అబద్ధమని నాకు స్పష్టంగా తెలుసు. అయితే రాజశేఖరం అబద్ధాలవెనుక ఘోరమైన సత్యాలుంటాయి. యిది నా నమ్మకం. అయితే వాడిది మ్రింగుడుపడని అబద్ధం. వ్యంగ్య మర్యాదలు దాటిపోయే సత్యం.

"మరి చూడు బ్రదర్! అబద్ధం అంటాడు. వొకరోజంతా పచ్చి కాఫీనీళ్ళతో పస్తుండి. ఆ గోనెసంచివిప్పి తాళపత్రాలు చూశాను. వచ్చేనెల పూనాలో జరిగే వోరియంటల్ కాన్ఫరెన్సులో వొక పేపరు చదువుతున్నా - కుక్షింభర పురాణంలోని సృష్టి రహస్యాల్ని గూర్చి. వొకవేళ పురాణాన్ని నమ్మకుండా వుందాం అనుకో. మరి ఈ కుంటి భిక్షగాళ్లో, గుడ్డి భిక్షగాళ్లో యెవళ్లో ఒకళ్ళు ఈ దరిద్రులు 'అనాది

వాళ్ళం బాబూ" అని యెందుకంటారు. కాబట్టి తార్కికంగా చూసినా ఆఛార్లగాడి అనాదివానికి భిక్షగాళ్ళతో రక్తసంబంధం వుంది.

వొక రోజేమైందంటే యిద్దరికి బాగా ఆకలయింది. తినడానికేముంది? చుట్టూ నీళ్ళున్నాయి. కాస్తా భూముంది. అప్పటికింకా జీవరాసులు పుట్టనేలేదు. వాటినైనా పీక్కుతినడానికి.

కొన్ని దినాలు, మాసాలు గడిచాయి. తిండి వేటలో రెండో అనాదివాడు పురఫ్, దరిద్రుడు వోడిపోయి ఆకలికి తాళలేక సొమ్మసిలి యెక్కడో గుట్టపక్కన పడిపోయాడు. ఈ లోపు జీవసృష్టి జరిగింది. మొదటి అనాదివాడు పురఫ్ దేవునికి తిండి దొరికింది. కావలసినంత గుహక్కూడా తెచ్చుకున్నాడు, అంటే రేపటికి దాచుకునే గుణం అలవడింది. దేవుడు దరిద్రున్ని లేపి యింత తిండి పడేశాడు. అప్పటికింకా కాంగ్రెసుపార్టీ, స్వతంత్రపార్టీ పుట్టలేదు. కాబట్టి మరీ దాచుకొని యేం చేస్తాంలే కొంత వీడికి పెడదాం అనుకున్నాడు. దరిద్రునికి సగం ఆకలి తీరింది. ఆకలి విజృంభించింది. అయితే కదలబుద్ధికాలేదు. వాడప్పుడే మానసికంగా జడుడయ్యాడు. 'నేన్లేవలేన్రా' అని నీరసంగా మూలిగాడు దరిద్రుడు. 'నేనే రోజుకింత తెచ్చిపెడతాలే' అన్నాడు దేవుడు. వో నాలుగైదు వారాలు యిట్లానే జరిగింది. దరిద్రుడు దేవుడిచ్చిందే చాలనుకోవటం-ఆ యింతా పాచిపోయిన మాంసం తినటం-యే చెట్టుక్రిందో నిద్ర పోవడం. 'వీడు నిద్రపోవడమే మంచిద'నుకున్నాడు దేవుడు. వీడు యిట్లాగే నిద్రపోతుంటే కేవలం తన దయా దాక్షిణ్యాలమీద ఆధారపడతాడు. దయతల్చి పెట్టినదాంతో తృప్తి పడతాడు. వాడూరుకుంటే

తాను దండిగా తినవచ్చు. కూడబెట్టుకోవచ్చు. యీలోపే దేవుడు వొక అడ మృగాన్ని గీరటం, కడుపు చెయ్యటం కూడా జరిగింది!!

"అబ్బ నీది నోరు కాదు. పాపాల పుట్ట!" చెవులు మూసుకున్నాడు ఆచార్లు.

"ఆచార్లూ నీలో మృగత్వంలేదా? లేకుండా వుంటే పెళ్ళి మానుకో. యే ఆడదాన్నీ సుఖపెట్టలేవు." అన్నాడు రాజశేఖరం.

"రాజశేఖరం బండి లూపులైను!" అన్నాను.

వీడి కథకు గమ్యమేమిటో నా కర్థంకాలేదు. రెండు మూడు భాషల్లోని కొన్ని వేల కథలు చదివాను. వాటి పరిణామం సగంలోనే అర్థమయ్యేది. వీడి కథా పరిణామమెటు? నాకర్థం కాకపోవటంతో కుతూహలం హెచ్చింది. పైగా నా తెలివిని ఛాలెంజి చేస్తోం దా కథ. సహించలేను. తొందరపెట్టాను కథ కానిమ్మని.

"అబ్బాయి కథకొస్తున్నా. యిట్లా కొన్నివుదయాలూ రాత్రులూ గడిచేసరికి ఆచార్లగాడి అనాదివాడు వురఫ్ దేవునికి స్వార్థం ప్రబలిపోయింది. కొన్ని యేళ్ళకు వానికి పిల్లలు పందిపిల్లల్లా పుట్టారు. యెందుకంటే యెన్నో ఆడమృగాల్ని దేవుడు గీరాడు యెన్నో అవతారాల్లో. దేవునిమీద ఆధారపడుతున్న దరిద్రుడుకూడా యీ లోపు చాలామంది పిల్లల్ని కనేశాడు. అసలు పిల్లల్ని కనేయటమనేదే దరిద్రులపని. వానికి దిక్కు తెలీలేదు. తిండి స్వశక్తిచే సంపాయించటం అనేది యిపుడు వాడు మరచిపోయాడు. అంటే వొకరిమీద ఆధారపడటం వాడి ఇన్‌స్టింక్టు అయిపోయిందన్నమాట. యీద్ఫ

చ్ఛికంగా నేర్చుకున్న సోమరితనం దరిద్రాన్ని పెంచింది. కొడుకు లకు, కూతుళ్ళకు బొచ్చెలు చేతికిచ్చాడు. మీ వృత్తి యిదే పొమ్మ న్నాడు. వాళ్ళు దేవుని బిడ్డల్తో తిట్లు తిని యింత తిండి బొచ్చెల్లో వేయించుకొని రాత్రి యే చెట్టు నీడల్లోనో తిని పడుకొనేవారు. రాత్రి మృగాలకు తలుగులిప్పేవారు. పిల్లల్ని కనేవారు.

యుగాలు గడచిపోయాయి. చరిత్రలో ప్రభుత్వాలు యేర్పడి నాయి. యీలోపు దేవుని సంతతి అంతస్తు పెరిగింది. భూమ్మీద వాళ్లుండేది కొద్దిమందే అయినా భూమ్మీదవున్న స్థిరచరాస్థులు చాల మటుకు వాళ్ళవి. జన్మ అంతస్తుల్ని నిర్ణయిస్తుందన్నారు. జనం నమ్మారు. అయితే కొన్నిసార్లు ఆకలికి తాళలేక రెండో అనాదివాని సంతతి చాలా ఆటవికదశలో వున్నపుడు దేవునిమీదికి తిరగ బడ్డారు. మేమూ పని చేస్తామన్నారు. మాకూ భాగం కావాలన్నారు. దేవుడు వాళ్ళని తెలివిగా అణచేశాడు. తర్వాత తర్వాత ప్రభుత్వాలు వాళ్ళ మనసు కీళ్ళ కీళ్ళని విరగొట్టేశాయి. వాళ్ళని అజ్ఞానంలో వుం చటం మంచిదని తెలివిగా అజ్ఞానంలోనే వుంచుతూనే వొక సాంప్ర దాయాన్ని యేర్పరచాయి. కాంగ్రెస్ ప్రభుత్వంకూడా యిపుడా సంప్రదాయాన్నే అనుసరిస్తోంది. యిక దరిద్రుడు యిపుడిపుడే తిరగ పట్లేడు. దేవుడు గుళ్ళోకి చేరాడు. రత్నాలు, మాణిక్యాలు ధరిం చాడు. దరిద్రుడు గోపురపు నీడల్లోకీ రోడ్ల పక్కకీ చేరాడు. చిరిగిన గోనెపట్టలూ బొచ్చెలూ చేతికి తీసుకున్నాడు.''

తాపీగా సిగరెట్ ముట్టించాడు రాజశేఖరం.

''రాజశేఖరం! నీవు సాటన్‌వి'' శక్తంతా కూడగట్టుకొని

పైకప్పు యెగిరిపోయేలా అరిచాడు అచార్లు. దంతెల్లోంచి వచ్చిన యెుఇక వొకటి క్రిందికి రాలింది.

"యేమన్నా అనుకోరా అబ్బీ. నీ అనాదివాడొక హిపొక్రిట్. వాడి సంతతిలోనివాడివి నీవో రోగ్‌వి. రెండో వాని సంతతిని అజ్ఞానంలో త్రోసింది మీరు. సోమరితనం నేర్పిందిమీరు. దరిద్రంలో ముంచింది మీరు. కావాలంటే రౌనక్ టాకీస్ ప్రక్కన సందులో వుండే అ దరిద్రుల్ని అడుగుపో. నీకు ధైర్యముంటే - మ్యాటీన్కి వెళ్తున్నా" తుఫానులా దూసుకపోయాడు రాజశేఖరం. అచార్లు యేదో చాలాసేపు గొణుక్కుంటూనే వున్నాడు.

రాజశేఖరం చెప్పింది కథ? యేమిటి? నా కర్థం కాలేదు. కానీ వొకటిమాత్రం అనుకున్నాను దిక్కుతోచక. రాజశేఖరం యేదో భయంకరంగా ఆలోచిస్తున్నాడు.

"సవ్యసాచి" : 13 సెప్టంబరు 1963.